## ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్, జూన్ 1: ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ పొట్ట పెంజర రమేష్, డిప్యూటీ చైర్మన్ తూకుంట్ల విశాల్ ఒక ప్రకటనలో కోరారు. ఆర్థిక మోసానికి గురైన ముస్సరాబాద్‌కు చెందిన కొప్పుల సుమన్, స్వాతికి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఐసీఎఫ్ ఏఐ యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మిప్రసన్న కాంట్రాక్టు ఆశ చూపి, డమ్మీ వర్కర్‌తో ఇన్వెస్ట్ చేయించి మోసానికి పాల్పడిందని ఆరోపించారు. అధిక వడ్డీ ఆశ చూపి రూ.50లక్షలు సుమన్, స్వాతి నుంచి వసూలు చేశారని, డమ్మీ కంపెనీలు నెలకొల్పి సతీష్, శ్రీధర్, అపర్ణ, గౌతమి, నాగ సృజన మోసానికి తెరలేపారని విమర్శించారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించగా ఎఫ్ఐఆర్ చేయాల్సిందిగా ఆదేశించిందని తెలిపారు. మోసానికి పాల్పడ్డ లక్ష్మిప్రసన్నపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## నిరాశ్రయులకు దుస్తులు అందజేత



బన్సీలాల్‌పేట్, జూన్ 1: నగరంలో ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, సంచార జాతుల వారికి దుస్తులు, దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఔషధాలను అందించామని, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు ప్రథమ చికిత్సను అందించామని చెప్పారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సీజీఎం



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, సూర్యం, భార్గవకుమార్

ముషీరాబాద్, జూన్ 1: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయునట్లు ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగిన ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిల్, పుస్తకాలు, ల్యాప్టాప్‌లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.సూర్యం, ప్రధాన కార్యదర్శి వి.భార్గవకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. తమపై నమ్మకంతో మరోసారి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ అధికారులు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ సాధన కోసం..

సికింద్రాబాద్, జూన్1: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో దక్షిణాది ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బోయ శంకర్‌ను నియమించినట్లు జాతీయ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నెల 30న ఏపీ అధ్యక్షుడిగా కైలా జయసుధను గుంటూరు సమావేశంలో నియమించినట్లు ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు జరగడం లేదని అన్నారు. అందుకు వారికి రాజకీయ అధికారం దక్కక పోవడమే ప్రధాన కారణమని, రిజర్వేషన్స్ స్థానాల్లో గెలుస్తున్న వారు రాజకీయ బానిసత్వానికి అలవాటు పడ్డారని విమర్శించారు. వారితో ప్రజలకు మేలు జరగడం లేదని, అందుకే తెలంగాణలో బహుజన సంఘాలతో కలిసి పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఏర్పాటు చేసి అన్నివర్గాలకు అధికారంలో జనాభా దామాషా పద్ధతిలో అన్ని రంగాల్లో వాటా కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బోయ శంకర్‌ను నియమించినట్లు ప్రకటిస్తున్న జాతీయ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్

## డబుల్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



డబుల్ బెడ్రూం కాలనీ సీ బ్లాక్ నూతన కమిటీ సభ్యులను అభినందించిన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, జూన్ 1: డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. ఆదివారం బండమైసమ్మనగర్ బస్తీలో నిర్మించిన డబుల్ బెడ్రూం కాలనీలోని సి బ్లాక్‌లో నివసిస్తున్న 120 మంది కుటుంబాలు కలిసి కొత్తగా 15 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హేమలతకు తమ సమస్యలను వివరించారు. అందరికీ సరిపడే విధంగా తాగు నీటి సరఫరా మెరుగుపరచాలని, లిఫ్టులు పనిచేయకపోవడం కారణంగా పై అంతస్తులకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్నదని తెలిపారు. డబుల్ బెడ్రూం కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవాలని, దుకాణాలను వెంటనే కాలనీ వాసులకు కేటాయించాలని వారు కార్పొరేటర్‌ను కోరారు. సమస్యలను తాను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వివరించి పరిష్కార చర్యలు చేపడతానని కార్పొరేటర్ వారితో అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

## 'దారి తప్పిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్' పుస్తకం ఆవిష్కరణ



ప్రముఖ రచయిత చెవ్వ రఘుపతిరావు రచించిన దారి తప్పిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, వందన, వరప్రసాద్, తదితరులు

ముషీరాబాద్, జూన్ 1: దళితులు, గిరిజన, ఆదివాసీల కోసం కేటాయించిన నిధులను ఆయా వర్గాల అభివృద్ధికే ఖర్చు చేసి వారి స్వావలంబనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నదని అక్షరం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మద్దులూరి ఆంజనేయులు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం సుందరయ్య కళాభవన్‌లో ప్రముఖ రచయిత చెవ్వ రాఘుపతిరావు రచించిన 'దారి తప్పిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన సబ్‌పాల్న్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేటాయించిన నిధులను చిత్తశుద్ధితో ఖర్చు చేసినప్పుడే సబ్‌ప్లాన్ ఫలాలు ఆశించిన స్థాయిలో దళిత, గిరిజనులకు అందుతాయని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వాలు ఇతర విభాగాలకు మళ్లించకుండా ఆయా వర్గాల అభివృద్ధికే ఖర్చుచేస్తే వారి ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షనైడ్ ప్రతినిధి వందన, వరప్రసాద్, రచయిత చెవ్వ ఘుపతిరావు, శివలింగం, తిరుపతి, మమత, సీనియర్ పాత్రికేయుడు బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.




## అక్షరంతో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతాం



అక్షరం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ముషీరాబాద్, జూన్ 1: అక్షరంతో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతామని అక్షరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దులూరి ఆంజనేయులు అన్నారు. అక్షరం సంస్థ ఆవిర్భావ సభ ఆదివారం ఉదయం పది గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో జరిగింది. అణగారిన వర్గాల ప్రజల పిల్లల అభ్యున్నతి కోసం అక్షరం అనునిత్యం పాటుపడుతుందని ఈ సందర్భంగా ఆంజనేయులు పేర్కొన్నారు. ఆయా వర్గాల చిన్నారులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడం కోసం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ వెంకటరెడ్డి, యాక్షనైడ్ ప్రతినిధి వందన, అమన్ వేదిక నిర్వాహకురాలు అంబిక, జనార్దన్, మురళి, జయ, వరప్రసాద్, ప్రముఖ రచయిత చెవ్వ ఘుపతిరావు, శివలింగం, తిరుపతి, మమత తదితరులు పాల్గొన్నారు.

## టీ షర్టుల పంపిణీ



టీ షర్టులను అందజేస్తున్న మహేష్‌యాదవ్

అమీర్‌పేట్, జూన్ 1: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలసాని మహేష్‌యాదవ్ కుమారుడు తలసాని శశాంక్‌యాదవ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం సనత్‌నగర్ జీహెచ్ఎంసీ మైదానంలోని క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు టీ షర్టుల పంపిణీ జరిగింది. ఈ మేరకు తలసాని మహేష్ యాదవ్, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, క్రికెట్ అకాడమీ చీఫ్ కోచ్ రాజ్‌కిరణ్‌లతో కలిసి ఇక్కడ శిక్షణ పొందుతున్న చిన్నారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. క్రికెట్లో శిక్షణ పొందుతున్న దాదాపు 100 మందికి పైగా చిన్నారులు ఈ టీ షర్టులను అందుకున్నారు.

### ముగిసిన కూటమి శిక్షణ

చిక్కడపల్లి,జూన్ 1: హెబ్రోను చర్చిలో హెబ్రోను సొసైటీ, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన 58వ అఖిల భారత యౌవనస్థుల కూటములు ముగిశాయి. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధి ఆర్.వీరచారి మాట్లాడారు. ఆలిండియా యూత్ క్యాంప్‌నకు యువత హాజరయ్యారన్నారు. బ్రదర్ జయరాజు వాక్యోపదేశం చేశారు. బ్రదర్ ఐజియా తిమోతి యువత సన్మార్గంలో నడుచుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. సొసైటీ, ట్రస్టు ప్రతినిధులు జానుందరావు. స్టీఫెన్ చిన్నప్ప, ఎం.ఇమ్మానుయేలు, ఆనంద్రరాజు, వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

# తలసీమియా బాధితుల కోసం రక్తదానం



గాంధీనగర్ కాలనీ కార్యదర్శి రవికాంత్‌కు ప్రశంసా పత్రం అందజేసిన టీం పారస్ సేవ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జూన్ 1: టీం పారస్ సేవ ఆధ్వర్యంలో గాంధీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. సికిల్‌సెల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌కు 100 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ప్రతి జూన్, డిసెంబర్ నెలలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని ప్రతినిధి జగదీష్ తెలిపారు. ప్రతి ఆదివారం క్లాక్ టవర్ వద్ద ఉదయం అల్పాహారం పంపిణీ, చలికాలంలో అనాథలకు దుప్పట్లు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వడం, క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి ఔషధాలు, క్రీడారంగంలో యువతకు చేయూత ఇస్తున్నట్లు చెప్పారు. తమకు రక్తదాన శిబిరానికి సహకరిస్తున్న గాంధీనగర్ కాలనీ అసోసియేషన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రవికాంత్, సంస్థ ప్రతినిధులు నితిన్ జైన్, రోహిత్‌జైన్, పూజ, లలిత్ చౌదరి, పురుషోత్తం, వెంకటేష్, నాగరాజు, సతీష్, శివ, ప్రకాష్, హనుమంతరావు, తదితరు పాల్గొన్నారు.

## దివ్యాంగుల చట్టం అమలు చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాగేశ్వరరావు

ముషీరాబాద్, జూన్ 1: దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను సమర్థవంతంగా అమలు చేసి పోలీస్ స్టేషన్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. వికలాంగుల హక్కుల చట్టం అన్ని పోలీస్ స్టేషన్లో అమలయ్యే విధంగా చూడాలని, అందులో 92 సెక్షన్ పై పోలీసులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. వికలాంగులపై దాడులు, దౌర్జన్యం ఆస్తులపై దాడులు వికలాంగుల హక్కులకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేసి తక్షణమే విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు జంగిలి శ్రీనివాస్, లక్ష్మణ్‌యాదవ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

అమీర్‌పేట్, జూన్ 1: ఆర్థిక, కుటుంబ సమస్యలను పరిష్కరించుకోలేక మానసిక వేదనకు గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మలిపెద్ది వెంకటరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. భార్య, కుమార్తెతో కలిసి కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. ఈ నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకట్‌రెడ్డి తిరిగి ఇంటికి చేరకపోవడంతో భార్య యాదాద్రి జిల్లాలో ఉంటున్న తన భర్త తండ్రికి విషయాన్ని తెలిపింది. ఇటీవలే ఓ ఇంటిని కూడా కొనుగోలు చేసిన వెంకటరెడ్డిపై ఆర్థిక సమస్యలు మరింత భారంగా మారాయి. దీంతో మానసికంగా కృంగిపోయిన వెంకటరెడ్డి తీవ్ర నిరాశకు లోనైన పరిస్థితుల్లో శనివారం భరత్‌నగర్‌లోని ఓయో లివింగ్ ట్రీలో గదిని తీసుకొని, అక్కడి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం విషయం వెలుగు చూడడంతో విషయాన్ని సనత్‌నగర్ పోలీసులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి



గాయకుడు త్రినాథరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ముషీరాబాద్, జూన్ 1: నవహృదయ రాగం ఆధ్వర్యంలో సినీ దిగ్గజాలు ఎన్టీఆర్, కృష్ణ జయంతిని పురస్కరించుకొని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రణయ, రాగ వాహిని పేరిట నిర్వహించిన సినీ సంగీత విభాగం పలువురిని ఆలోచింపజేసింది. గాయకులు అలనాటి మధుర గీతాలు ఆలపించి రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు పాల్గొని కళాకారులను సత్కరించారు.

## అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



కాశీనాథ్‌శర్మను సన్మానిస్తున్న మారిశెట్టి నర్సింగ్‌రావు, లక్ష్మారెడ్డి, తదితరులు

చిక్కడపల్లి, జూన్ 1: అంకితభావంతో పనిచేస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తాయని లక్ష్మిగణపతి ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఆలయ అర్చకుడు ఇ.కాశీనాథశర్మ పదవీ విరమణ ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. కాశీనాథశర్మ, రాజమణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు బీఎన్ శ్రీనివాసయాదవ్, మ్యోహన్ రావు, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ ఈఓ దేవనాథం, కమిటీ సభ్యులు శివకుమార్, భానుచందర్, భాగ్యలక్ష్మి, సాయికీర్త్, గుర్రం దినేష్, గజానంద్, రాకేష్‌కుమార్, అభిషేక్ కెనడీ, జగదీశ్‌బాబు, శీలం త్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూన్ 1: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మౌలాలి-చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చ్యూరీకి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై పసుపు రంగు టీ షర్టు, నలుపు రంగు లుంగీ ఉన్నట్లు తెలిపారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసులు కేసు నమోదు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధికులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



కార్యక్రమంలో అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు నివాళులర్పిస్తున్న అతిథులు

కవాడిగూడ, జూన్ 1: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంలో చదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా సికింద్రాబాద్ ఆర్డీఓ పి.సాయిరాం, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహారావు, కోశాధికారి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు గుంటి విజయ్‌బాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు స్టాలిన్, మహేందర్, దాసరి యాదగిరి, రాపాక అశోక్, గోవర్ధన్, మల్లేష్, మహేష్, లింగం, సుదర్శన్, రమేష్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల కోసం ప్రత్యేక క్రికెట్ పోటీలు




సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్

చిక్కడపల్లి, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ (టీఎస్‌సీఏడీ) ఆధ్వర్యంలో బధిరుల కోసం ప్రత్యేక క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌సీఏడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షు డు వల్లభనేని ప్రసాద్, కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ హైదరాబాదులో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి ఆసియా కప్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాజధాని వరకు ఆసక్తి ఉన్న బధిరులు ఇందులో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో భాగంగా నూతన సంస్థాగత కార్యవర్గాన్ని నియమించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లభనేని ప్రసాద్, కార్యదర్శిగా చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా విజయ ప్రకాష్, జాయింట్ సెక్రటరీగా షకీల్, కోశాధికారిగా ఇమ్రాన్ సహా పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హియరింగ్ అధినేత చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.